స్వాతి మాసపత్రిక: అక్టోబర్, 1997

# టైమెంత?

లియాఖతుల్లా, సైకిల్ దిగి, ఆఫీసు ఆవరణంతా చూశాడు. వరండాలు ఊడుస్తూ పోచమ్మ, నర్సమ్మ కనిపించారు.

యాదయ్య నల్లా దగ్గర కూజాలకు నీళ్ళు నింపుతున్నాడు. సైకిల్ స్టాండులో అక్కడక్కడా నాలుగైదు సైకిళ్ళు తప్ప లేవు.

టైము చూశాడు. 9.30 అయింది. టైము కరెక్టా? అన్న అనుమానం వచ్చింది. ఎవర్ని అడగాలి.

ఆవరణలో చింతచెట్టు కింద, ఆంధ్రా నుంచి వచ్చి, కూర్చున్న ఓ బట్టతల ఆసామి కనిపించాడు. అతడి చేతికి వాచీ కూడా వుంది.

లియాఖతుల్లా సైకిల్‌కు స్టాండు వేసి, అడుగులో అడుగు వేసుకుంటూ, చింతచెట్టు కిందకు చేరాడు. జేబులోంచి 'దస్తీ' తీసి, మొహాన పట్టిన చెమట తుడుచుకుని, "టైం క్యాహై?" అన్నాడు.

ఆంధ్రా నుంచి వచ్చిన ఆసామికి, 'టైం' అన్న మాట తప్ప, 'క్యాహై?' అంటే అర్థం

కాలేదు.

ఆంధ్రప్రదేశ్ అవతరించి ఇన్నాళ్ళయినా, తెలుగుకు ఆదరణ లేకపోవడం బాధ వేసింది. వచ్చింది ఆఫీసు పని మీద. ఎదురుగా వున్నది ఆఫీసులో పనిచేసే వ్యక్తి.

కనుక, గడియారం వైపు చూసి, "పావు తక్కువ పది!" అన్నాడు ఆంధ్రా ఆసామి.

"కిత్నా?" - లియాఖతుల్లా రెట్టించాడు, అతను చెప్పిన టైమెంతో అర్థంకాక.

ఆంధ్రా ఆసామి ఏం జవాబు చెప్పాలో తెలియక, ఏకంగా చేయి చాచి, వాచీ, లియాఖతుల్లా కళ్ళ ముందు పెట్టాడు.

లియాఖతుల్లా "పౌనే దస్" అని గొణుక్కుని, నింపాదిగా వెళ్ళి, సైకిల్ స్టాండులో పెట్టి, తాళం వేసి, సత్తు టిఫిన్ బాక్స్ తీసుకుని, కార్యాలయంలోకి ప్రవేశించాడు.

దస్తీతో కుర్చీ దులుపుకుని, ఫ్యాన్ స్విచ్ వేసుకుని, కాళ్ళు జాపుకుని, సైకిల్ తొక్కిన అలసట తీర్చుకోసాగాడు. ఓ క్షణం చిన్న కునుకు కూడా తీశాడు లియాఖతుల్లా.

పదిన్నరకు కార్యాలయంలో నెమ్మదిగా సందడి ప్రారంభమైంది. మనుషుల మాటలు, బల్లలు కదిల్చిన శబ్దాలు, అధికారులు వచ్చిన సూచనగా, జీపు చప్పుడు.... వీటితో, లియాఖతుల్లాకు నిద్ర కాస్తా చెదిరింది.

ఎదురుగా వున్న కుర్ర గుమాస్తాని, "టైం క్యాహువా?" అనడిగాడు.

"సాడే దస్"

లియాఖతుల్లా ఉలిక్కిపడి లేచి, బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని, తాబేలులా నడిచి ఆఫీసు క్యాంటీనుకు చేరాడు.

అప్పటికే కొందరు ఉద్యోగులు, ఆఫీసు పని మీద వచ్చిన పైరవీకారులు క్యాంటీన్‌లో వున్నారు.

లియాఖతుల్లా 'సింగిల్ చాయ్' తాగి, చార్మినార్ సిగరెట్ వెలిగించి బద్ధకం నిద్ర అనుభవించాడు.

క్యాంటీన్‌లో జనం తగ్గారు.

లియాఖతుల్లా, "ఖదీర్ భాయ్... టైం క్యాహువారే?" అనడిగాడు.

"పౌనే గ్యారా"

లియాఖతుల్లా క్షణం ఉలిక్కిపడి, తన చేతికున్న వాచీ వైపు చూసి, నింపాదిగా ఆఫీసులోకి అడుగు పెట్టాడు.

అడ గుమాస్తాలు ముచ్చట్లాడుతున్నారు. కుర్ర గుమాస్తాలు జోకులేసుకుంటున్నారు. కొందరు పాతకాలం ఉద్యోగులు, ఫైళ్ళు ముందేసుకుని పనిలో నిమగ్నమైనారు.

లియాఖతుల్లా గడియారం, ఉంగరం, మనీపర్స్, కలం మొదలైన సామానులన్నీ, డ్రాయరులో భద్రపరచి, చొక్కా చేతులు పైకి మడిచి, ఆఫీసు లెట్రిన్‌లోకి ప్రవేశించాడు.

టైపు మిషన్ చప్పుళ్ళు, ఉద్యోగుల సంభాషణలు, రోడ్డు మీద పోయే బస్సుల,

లారీల, కార్ల చప్పుళ్ళు.. ఏవీ పట్టించుకోకుండా, లియాఖతుల్లా పాయిఖానాలో వుండి పోయాడు. ఆఫీసరు పిలుస్తాడేమోనన్న బెరుకు, తన సీటుతో పని బడి ఎవరన్నా వచ్చి వుంటారన్న ఆలోచనా లేదు - ఉండదు లియాఖతుల్లాకు!

పాయిఖానా పని అయ్యాక, కాళ్ళు చేతులు కడుక్కుని, తల దువ్వుకుని, దారిలో ఎకౌంటు సెక్షన్‌కు వెళ్ళి, ఫెస్టివల్ ఎడ్వాన్స్ బిల్లు ట్రెజరీకి వెళ్ళిందో లేదో కనుక్కున్నాడు.

మళ్ళీ తన సీటులో కొచ్చి కూర్చుని, గడియారం, ఉంగరం, మనీపర్సు, కలం యథాస్థానాల్లో పెట్టుకుని -

"రావ్! టైం క్యా హువా?" అనడిగాడు.

"ట్వెల్వ్" అన్నాడు కుర్రగుమాస్తా.

లియాఖతుల్లా తన బల్ల మీద చూశాడు - ఫైళ్ళు వున్నాయేమోనని! లేనందుకు సంతోషించి, కళ్ళు మూసుకున్నాడు. అది నిద్ర కాదు - అలసట!

చాంద్రాయణగుట్ట నుంచి రోజూ సైకిల్ మీద రావడం! పైబడ్డ వయస్సు - కుటుంబ భారం! పిల్లల చదువు - డబ్బు చాలకపోవడం!

సరిగ్గా ఒంటి గంటకు, మింట్ కాంపౌండ్‌లోంచి సైరన్ మోత, ఆ పక్కనున్న మసీదు లోంచి మధ్యాహ్నపు నమాజు... శబ్దాలకు లియాఖతుల్లా కళ్ళు తెరచి, ఒళ్ళు విరుచుకుని-

"టైం ఏక్ బజే?" అని ఆశ్చర్యపోయాడు.

చుట్టూ చూశాడు. అటెండరు అయిపు లేడు. హాల్లో గుమాస్తాలు, లంచ్‌కి బయలు దేరుతున్నారు. ఆడ గుమాస్తాలు గుంపులుగా, జట్లుగా లంచ్‌కి వెడుతున్నారు.

లియాఖతుల్లా, డ్రాయరు సొరుగులోంచి టిఫిన్ బాక్స్, గ్లాసు తీశాడు. కూజాలోంచి నీళ్ళు వంపుకుని, గ్లాసు కడుక్కుని, నీళ్ళు తెచ్చుకున్నాడు.

టిఫిన్ బాక్స్‌లో రొట్టెలు చెక్కముక్కల్లా వున్నాయి. పాలకూర, టొమాటో కూరతో ఒక్కో రొట్టెముక్క నమలసాగాడు.

లంచ్ కార్యక్రమం, రొట్టె ముక్కలు, కటకటా నమలటం పూర్తయ్యేసరికి, రెండు గంటలయింది. టిఫిన్ బాక్స్ కడుక్కుని, సంచిలో పెట్టుకుని, క్యాంటీన్‌కు వెళ్ళాడు లియాఖతుల్లా.

క్యాంటీన్‌లో జనం ఎక్కువగానే వున్నారు. ఓ మూల విరిగిన స్టూలు మీద చతికిలబడి టీ తాగి, చార్మినార్ ముట్టించుకుని, సేద దీరాడు. గోడకు ఆనుకుని ఓ కునుకు తీశాడు.

మూడు గంటలైంది.

లియాఖతుల్లాకు మెళకువ వచ్చింది.

"ఖాదిర్! టైం క్యాహువారే?" అనడిగాడు.

"తీన్ బజ్‌గయ్ సాబ్!"

లియాఖతుల్లా, మళ్ళీ ఆఫీసులో తన సీటులో కెళ్ళి కూర్చున్నాడు.

"కోయీ - బులాయా!" అనడిగాడు గుమాస్తాని.

ఆ గుమాస్తా జవాబివ్వలేదు.

లియాఖతుల్లాకు విసుగ్గా వుంది. బద్ధకంగానూ వుంది. కుర్చీలో అసహనంగా వుంది.

గడియారం, ఉంగరం, మనీపర్స్, కలం తీసేసి, పాయిఖానాకు వెళ్ళాడు.

పాయిఖానాలో, నింపాదిగా పని కానిచ్చుకుని, వస్తూ వస్తూ పాత ఉర్దూ పేపరు వరండాలో దొరికితే వెంట తెచ్చుకున్నాడు.

కళ్ళజోడు తగిలించుకుని, పేపరంతా తిరగేశాడు. ఇంకా ఆఫీసు వదిలి వెళ్ళే వేళ కాలేదు. ఆ పేపరు తేదీ చూశాడు. ఆశ్చర్యపోయాడు.

గత సంవత్సరం పేపరది. దాన్ని అవతల పారేశాడు లియాఖతుల్లా.

లేచి, టిఫిన్ బాక్స్ తీసుకుని సైకిల్ స్టాండు కొచ్చాడు. ఓ పాత గుడ్డ తీసుకుని, సైకిలంతా శుభ్రంగా తుడిచాడు.

"టైం క్యాహువా?" అనడిగాడు, లోకల్ టపా తీసుకొచ్చిన అటెండర్ని.

"సాడే చార్"

లియాఖతుల్లా, సైకిల్ తీసుకుని బయలుదేరాడు. లక్డీకాపూల్‌లో గాలి కొట్టించుకున్నాడు. ఆపై ఇంటి దారి పట్టాడు.

తాబేలులా సైకిల్ తొక్కుతూ బయలుదేరాడు. నాంపల్లి, గాంధీ భవన్, మొహంజాహీ మార్కెట్, అఫ్జల్‌గంజ్...

'ఢాం' - సైకిల్ ట్యూబ్ పంచరైంది.

'సైకిల్‌కి సర్వీసైపోయింది. తన సర్వీసు ఇంకా వుంది' అని మనస్సులోనే అనుకున్నాడు.

చదివింది ఉర్దూ మీడియం! ఉద్యోగంలో చేరింది - నైజాం జమానాలో! ఇప్పుడు ఆంధ్రప్రదేశ్! అంతా ఇంగ్లీష్! లియాఖతుల్లాకు ఇంగ్లీషు అక్షరాలు కూడా రావు - సంతకం నేర్చుకున్నాడు.

'క్యా జమానా ఆగయా!' అని తిట్టుకున్నాడు, సైకిల్ రిపేరర్ దగ్గర కూర్చుని.

వీధి దీపాలు వెలిగాయి. సైకిల్‌కి పంచర్ వెయ్యడం గాలేదు!

అప్పుడు గుర్తుకొచ్చింది, లియాఖతుల్లాకి, తనీ రోజు హాజర్‌లో సంతకం పెట్టలేదని!

"టైం క్యాహువా?"

"మేరా ఘడీ రుక్ గయా సాబ్"

అవును.... తన బతుకూ ఆగిపోయింది. మారుతున్న కాలంతో పరిగెత్తలేక... అందుకే చేతికి గడియారం వున్నా ఆడదు - పరువు కోసం పెట్టుకుంటున్నాడు. చేసే పని లేకపోయినా ఉద్యోగంలో కొనసాగుతున్నాడు - లియాఖతుల్లా. •